# ఎన్నికల నియమాలు పాటించాలి

- కోడ్ ఉల్లంఘన ఫిర్యాదుల కోసం 1950 టోల్ ఫ్రీ కాల్ సెంటర్
- సామాజిక మాధ్యమాల్లో అసత్యాలు, అపోహలు, వదంతులను ప్రచారం చేస్తే చర్యలు
- ములుగు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఇలా త్రిపాఠి
- అక్రమ నగదు లిక్కర్ సరఫరా జరుగకుండా చర్యలు
- ఎస్పీ గౌష్ ఆలం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, పక్కన ఎస్పీ గౌష్ ఆలం, ఐటీడీఏ పీవో అంకిత్

ములుగుటౌన్, అక్టోబర్12 : ఎన్నికల ప్రవర్తనా నియమాలను ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియా తూచా తప్పకుండా పాటించాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఇలా త్రిపాఠి అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో ఎస్పీ గౌష్ ఆలం, రిటర్నింగ్ అధికారి అంకిత్‌తో కలిసి ఎన్నికల నిర్వహణపై కలెక్టర్ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో తమ పేరు సరిచూసుకోవాలని, లేని వారు అక్టోబర్ 31 వరకు ఓటరుగా నమోదు చేసుకునేందుకు అవకాశం ఉందని తెలిపారు. జిల్లాలో ఎన్నికల నిర్వహణకు 303 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. అవసరమైన మేర బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రాజకీయ పార్టీలు సమావేశాలు నిర్వహించుకునేందుకు సింగిల్ విండో సిస్టం ద్వారా అనుమతులు ఇస్తామని, ముందు ఎవరు దరఖాస్తు చేసుకుంటే వారికి అనుమతి ఉంటుందన్నారు. ఉదయం 6 నుంచి రాత్రి 10 గంటల వరకే లౌడ్ స్పీకర్లు వినియోగించాలన్నారు. రాజకీయ సమావేశాలు ఆలయాలు, మసీదులు చర్చిలు ప్రార్థన స్థలాల వద్ద ఉండవద్దని, పోలింగ్ కేంద్రాలకు 100 మీటర్ల పరిధిలో ఉండవద్దని సూచించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనపై వచ్చే ఫిర్యాదులను పరిష్కరించేందుకు సర్వే సర్వేలైన్స్, ఫ్లైయింగ్ స్క్వాడ్, వీడియో సర్వేలెన్సు బృందాలు, ఎంసీఎంసీ కమిటీ, ఇతర కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. సామాజిక మాధ్యమాల్లో అసత్య ప్రచారాలు ఇతర ప్రాంతాల్లో జరిగిన వీడియోలు ఇక్కడ జరిగినట్లు ప్రచారం చేయడం, పాత వీడియోలను ప్రచారం చేయడం, ఎన్నికల నిర్వహణ నేపథ్యంలో ప్రజలను అయోమయానికి గురి చేసేలా అసత్యాలు, వదంతులు ప్రచారం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. వీటిని మీడియా సర్టిఫికేషన్, మానిటరింగ్ కమిటీ (ఎంసీఎంసీ) పర్యవేక్షిస్తున్నదన్నారు. వాట్సాప్ గ్రూప్‌ల్లో తప్పుడు సమాచారం వ్యాప్తి చెందకుండా అడ్మిన్లు పూర్తి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎస్పీ గౌస్ ఆలం మాట్లాడుతూ అక్రమ నగదు లిక్కర్ సరఫరా జరక్కుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. సామాజిక మాధ్యమాల్లో ఫేక్ న్యూస్ ప్రచారం చేయవద్దని, ఒక మతాన్ని, ప్రాంతాన్ని, వ్యక్తిని కించపరిచే వ్యాఖ్యలు చేయవద్దన్నారు. ఇలాంటి ప్రచారాలు చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. సమావేశంలో ఎంసీఎంసీ కమిటీ మెంబర్ ఎస్ శ్రీధర్, డీపీఆర్వో రఫిక్, విలేకరులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎలక్షన్ సిబ్బంది పాల్గొన్నారు.



ఎమ్మెల్యే గండ్రతో కలిసి మంత్రి కేటీఆర్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న సురేందర్

## మిట్టపల్లికి ఎన్నికల ప్రచార బాధ్యతలు

### ఎమ్మెల్యే గండ్రతో కలిసి మంత్రి కేటీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపిన సురేందర్

టేకుమట్ల, అక్టోబర్12 : టేకుమట్ల మండలం వెల్లంపల్లి గ్రామానికి చెందిన సినీగేయ రచయిత మిట్టపల్లి సురేందర్‌కు సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ హాజరయ్యే ఎన్నికల ప్రచార సభల్లో పాటలు పాడే బాధ్యతలను మంత్రి కేటీఆర్ హైదరాబాద్‌లోని తన నివాసంలో ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి సమక్షంలో అప్పగించినట్లు మిట్టపల్లి మిత్రమండలి సభ్యులు అందె కుమార్, సతీశ్, పాల శంకర్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఎన్నికలు అయిపోయే వరకు మిట్టపల్లి తన కళా బృందంతో ఆట, పాటలతో ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్, ఎమ్మెల్యే గండ్రకు మిట్టపల్లి సురేందర్ ధన్యవాదాలు తెలిపారు.

## ములుగు అభ్యర్థి నాగజ్యోతిని
# భారీ మెజార్టీతో గెలిపించాలి

- కార్యకర్తలు కష్టపడి పనిచేయాలి
- ప్రతి ఒక్కరికీ పార్టీలో గుర్తింపు ఉంటుది
- ములుగుపై సీఎం కేసీఆర్‌కు ఎంతో ప్రేమ
- బీఆర్ఎస్ వచ్చాకే అభివృద్ధి జరిగింది
- మూడు మండలాల ఎన్నికల ఇంచార్జి సమ్మారావు

తాడ్వాయి, అక్టోబర్12 : ఉద్యమ కుటుంబ నేపథ్యం, ప్రజాసేవకే అంకితమైన తల్లిందండ్రుల స్ఫూర్తితో తాను కూడా ప్రజాసేవకే అంకితమయ్యేందుకు ముందుకు వచ్చిన ములుగు బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బడే నాగజ్యోతిని భారీ మెజార్టీతో గెలిపించాలని తాడ్వాయి, గోవిందరావుపేట, వెంకటాపురం మండలాల పార్టీ ఎన్నికల ఇన్‌చార్జి సాంబారి సమ్మారావు అన్నారు. తాడ్వాయి మండలకేంద్రంలోని సీనియర్ నాయకుడు పిన్నింటి యాదిరెడ్డి ఇంటివద్ద బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మల్లయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. తెలంగాణలో బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. ములుగు నియోజకవర్గంపై సీఎం కేసీఆర్‌కు ఎంతో ప్రేమ ఉందని అందుకే ములుగును జిల్లాగా ప్రకటించడంతో పాటు ఏటూరునాగారాన్ని రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేశారన్నారు. అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలతో పాటు రైతులను రాజుగా మార్చేందుకు ఎన్నో పథకాలను తీసుకొచ్చి అమలు చేస్తున్నారని వివరించారు. బీఆర్ఎస్‌ను గ్రామస్థాయిలో బలోపేతం చేయాలన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు సూచించారు. నాగజ్యోతిని అధిక మెజార్టీతో గెలిపించేందుకు ప్రతి ఒక్కరూ సైనికుల్లా కృషిచేయాలన్నారు. సమావేశంలో ఉప సర్పంచ్ ఇంద్రారెడ్డి, పార్టీ మండల ఉపాధ్యక్షుడు రజినీకర్‌రెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షుడు బంగారి సాంబయ్య, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, సలెందర్, వసంతరావు, మనోజ్, నాగరాజు, రాజేందర్, లక్ష్మయ్య, సురేశ్, చంద్రయ్య, రాజమౌళి పాల్గొన్నారు.



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న సమ్మారావు



యూత్ సభ్యులకు గులాబీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న పుట్ట మధు

# యువత చేతిలోనే దేశ భవిష్యత్తు

- బీఆర్ఎస్ గెలుపునకు సైనికుల్లా పనిచేయాలి
- మంథని ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధు
- పార్టీలో చేరిన మహాముత్తారం యూత్ సభ్యులు

మహాముత్తారం, అక్టోబర్12 : యువత చేతిలోనే దేశ భవిశత్తు ఉందని పెద్దపల్లి జడ్పీ చైర్మన్, బీఆర్ఎస్ మంథని నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధు అన్నారు. మండలానికి చెందని 30 మంది యూత్ సభ్యులు బీఆర్ఎస్‌లో చేరగా వారికి మంథని పట్టణంలోని రాజగృహాలో గులాబీ కండువాలు కప్పి మధు పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్ తరాల గురించి ఆలోచించే ఏకైక పార్టీ బీఆర్ఎస్ అన్నారు. బీఆర్ఎస్‌లోనే యువతకు ప్రాధాన్యత ఉంటుందని, గెలుపు కోసం ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేయాలన్నారు. పార్టీలో చేరిన వారిలో మహాముత్తారం యూత్ సభ్యులు పంగ సురేశ్, పంగ దేవేందర్, కొయ్యాల మహేందర్, మంథెన లవకుమార్, రాజబాపు, రామిళ్ల వంశి, ఆసంపల్లి లచ్చయ్య, కొండ మల్లయ్య, పోచయ్య, గంధం రాజబాపు ఉన్నారు. ఈ కార్యక్రమంలో మహాముత్తారం మాజీ జడ్పీటీసీ మందల రాజిరెడ్డి, కాటారం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రాధారపు స్వామి, ఎంపీటీసీ శ్రీపతి సురేశ్, సతీశ్‌రెడ్డి పాల్గొన్నారు.

## ములుగు డీఏవోకు ఇండియా ఎక్సలెన్స్ అవార్డు

ములుగు, అక్టోబర్12(నమస్తేతెలంగాణ) : జిల్లా వ్యవసాయ శాఖ అధికారిగా పనిచేస్తున్న కేఏ గౌస్‌హైదర్ 31 ఏండ్లుగా కరొకే సంగీతంలో ప్రదర్శనలు చేసినందుకు ఇండియా ఎక్సలెన్స్ అవార్డును ఇండియన్ క్రికెట్ టీమ్ మాజీ కెప్టెన్ సునిల్ గవాస్కర్ చేతుల మీదుగా అందుకున్నారు. ఢిల్లీలో జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో గౌస్ హైదర్‌కు అవార్డుతో పాటు ప్రశంసా పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1992 నుంచి కరొకే సంగీతంలో ప్రదర్శనలు ఇస్తున్నట్లు చెప్పారు. అంతేకాకుండా కరొకే సంగీతంలో అంద విద్యార్థులకు శిక్షణ అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రైమ్‌టైమ్ సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన అవార్డుల ప్రధానోత్సవం కార్యక్రమంలో ఈ అవార్డును అందుకున్నట్లు తెలిపారు.




సునీల్ గవాస్కర్ నుంచి అవార్డును అందుకుంటున్న గౌస్‌హైదర్

# ఎన్నికల ఖర్చుపై నిఘా ఉంచాలి

- అసెంబ్లీ నియోజకవర్గానికి అభ్యర్థి ఎన్నికల ఖర్చు గరిష్ఠంగా రూ.40 లక్షలు
- ప్రతి అభ్యర్థికి సమాన హక్కులు కల్పిస్తూ ఎన్నికలు నిర్వహించాలి
- భూపాలపల్లి కలెక్టర్ భవేశ్ మిశ్రా

భూపాలపల్లి రూరల్, అక్టోబర్ 12: రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రతి అభ్యర్థి ఎన్నికల వివరాలను నమోదు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు. గురువారం ప్రగతిభవన్‌లో అభ్యర్థుల ఖర్చుల నమోదుపై కలెక్టర్ అకౌంటింగ్ బృందాలతో రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి అభ్యర్థికి సమాన హక్కులు కల్పిస్తూ ఎన్నికలు నిర్వహించాలన్నారు. ఎన్నికల ఖర్చు గరిష్టంగా రూ.40 లక్షలుగా నిర్ణయించిందని, జిల్లాలో జరిగే రాజకీయ పార్టీల సమావేశాలు, సభలు, ఫ్లెక్సీలు, బ్యానర్లు, కరపత్రాల పంపిణీ, బహిరంగ సభలకు అయ్యే ఖర్చుల వివరాలను అభ్యర్థి ఖాతాలో నమోదు చేయాలని సూచించారు. నామినేషన్ వేసినప్పటి నుంచి అభ్యర్థి ఎన్నికల కోసం చేసే ఖర్చులకు ప్రత్యేక బ్యాంకు ఖాతాను ప్రారంభించాలని, అందులో నుంచే ఎన్నికలకు ఖర్చు చేయాలన్నారు. వీటిని పరిశీలించేందుకు ఏర్పాటు చేసిన ఫ్లయింగ్ స్క్వాడ్స్ బృందాలు, ఎన్నికల వ్యయ పరిశీలకులు, వీడియో సర్వేలెన్స్ బృందాలు, వీడియో వ్యూయింగ్ బృందాలు, అకౌంటింగ్, మానిటరింగ్ సెల్‌కాల్ సెంటర్, స్టాటిక్ సర్వేలైన్స్ బృందాలు, వ్యయమానిటరింగ్ సెల్ తదితర బృందాలు పకడ్బందీగా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. జిల్లాలోని ప్రింటింగ్ ప్రెస్ యజమానులు ఎన్నికలకు సంబంధించిన కరపత్రాలు, ఫ్లెక్సీలు, బ్యానర్లు ముద్రించే సమయంలో తప్పనిసరిగా ముందస్తు అనుమతి తీసుకోవాలని, ఫ్లెక్సీలపై ఎవరు ముద్రిస్తున్నారో వారి ఫోన్ నంబర్ తప్పనిసరిగా ప్రింట్ చేయాలన్నారు. డబ్బు, మద్యం ప్రభావం ఉండకుండా నిరంతరం నిఘా ఉండాలన్నారు. ప్రజాప్రాతినిధ్యం 1951 ప్రకారం ఎన్నికల ప్రవర్తనా నియమాలు ఉల్లంఘించే వారిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, అసిస్టెంట్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, ఆడిట్ ఆఫీసర్ శ్రవణ్, డీపీఆర్వో శ్రీధర్, డీపీవో ఆశాలత పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ భవేశ్‌మిశ్రా